

# సాయిలీల

**కుంచపు సూర్యనారాయణ**

'అదిగదిగో రాయలేలిన సీమ రతనాల సీమ' అదే నేడు రాయలసీమ. ఆ సీమలో అనంతపురం జిల్లా కదిరి పట్టణంలో సాంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకు విలువిచ్చే ఒక చక్కని కుటుంబం. కుటుంబ సభ్యులు భార్య, భర్త, వారికి ఇద్దరు కుమారులు, సూర్య, స్వామి. కుమార్తె రమ. ఆ కుటుంబమంతా షిరిడి సాయిబాబాను తమ ఇలవేల్పుగా కొలిచేవారు. సూర్య వాళ్ళ అమ్మ ఒకరోజు దేవుని పూజిస్తూ నా కుమారుడు సూర్యకు ఉద్యోగం వస్తే ముడుపుతో నీ షిరిడి ఆలయానికి పంపుతానని ఆ షిరిడి సాయిబాబాను ప్రార్థించింది. కొద్ది రోజులకు సూర్యకు బడిపంతులు ఉద్యోగం రానే వచ్చింది.

సూర్య వాళ్ళ అమ్మ చాలా సంతోషంతో తనన కుమారుడిని షిరిడి ప్రయాణానికి సిద్ధం చేసింది. సూర్య రైల్వే స్టేషన్‌కు వెళ్ళాడు. ఆ రోజు సరిగ్గా సమయం ఆరు గంటలకు కదిరి రైల్వే స్టేషన్‌కు రైలు వచ్చి ఆగింది. సూర్య రైలు ఎక్కి కూర్చున్నాడు. ఆ క్షణంలో సూర్య తన మనసులో ఇలా అనుకుంటూ వున్నాడు. తన తల్లిదండ్రులు తన మీద పెట్టుకున్న ఆశలను నెరవేర్చి షిరిడి సాయి బాబాను, షిరిడి పుణ్యక్షేత్రాన్ని చూడబోతున్నాను అని ఎంతో సంతోషంగా వున్నాడు. ఒక ప్రక్క తుంపరలాంటి చినుకులు అతని చెక్కిలిని ముద్దాడుతున్నాయి. బయటి నుండి చిన్న విజిల్ సౌండ్ వినిపించింది. రైలు తిన్నగా బయలుదేరింది. తర్వాత వేగాన్ని పుంజుకుంది.

రైలు చాలా స్టేషన్‌లను దాటి వెళుతూ వుంది. సూర్య కునుకు తీస్తూ వున్నాడు. చటుక్కున మేలుకున్నాడు. టైము చూసుకున్నాడు. సరిగ్గా రాత్రి 2 గం॥లు కావస్తున్నది. రైలు ఆంధ్రప్రదేశ్ దాటి, మహారాష్ట్రలో ప్రయాణిస్తూ వుంది అని అనుకుంటూ వున్నాడు సూర్య. అంతలోనే పెద్ద శబ్దం, చిమ్మ చీకటి అరుపులు, కేకలు. కారణం రైలు పట్టాలు తప్పిందని, జనం ప్రాణాలను కాపాడుకోవడం కోసం ఒకరి మీద ఒకరు పడుతూ లేస్తూ తమ ప్రాణాలను కాపాడుకోవడానికి చూస్తున్నారు. రైలు బోగీలు అన్నీ చెల్లా చెదురయ్యాయి, చాలామంది చనిపోయారు.

ప్రాణాలతో బయటపడినవారు తల దాచుకోవడానికి గుట్ల వెంబడి, చెట్ల వెంబడి పరుగులు తీస్తున్నారు. ఒక ప్రక్క వర్షం కుండపోతగా పడుతోంది. సూర్య కూడా తల దాచుకోవడం కోసం అటుగా పరుగు తీశాడు. అల్లంత దూరాన మిణుకు మిణుకుమంటూ చిరు వెలుగుతో ఒక గుడిసె కనిపించింది. పరుగు పరుగున ఆ గుడిసె దగ్గరకు వెళ్ళి తలుపు తట్టాడు. ఆప్యాయంగా లోపలకు ఆహ్వానించారు ముసలి దంపతులు. తుడుచుకోవడానికి టవలు ఇచ్చారు, బట్టలు ఇచ్చారు. చలికి వణుకుతున్న అతనిని చూసి తాత చలిమంట వేశాడు. ముగ్గురూ చలి కాచుకుంటూ వున్నారు. అప్పుడు సూర్య వివరాలు అడిగి తెలుసుకున్నారు ఆ వృద్ధ దంపతులు. జరిగిన ఘోర ప్రమాదం గురించి సూర్య చెప్పగా విని వారు ఇలా అన్నారు. "ఆ షిరిడి సాయిబాబాయే నిన్ను రక్షించాడు నాయనా" అన్నారు.

కడుపుకింత ఏమైనా తిన్నాడో లేదో బిడ్డ అని అవ్వ తాతతో అంటున్నది. వెంటనే తిన్నాను తిన్నానవ్వా అన్నాడు సూర్య. ఆ గుడిసెను చూస్తూ "ఈ ఇంట్లో దారిద్ర్యం విలయతాండవం చేస్తున్నట్లుంది కాబోలు" అని మనసులో అనుకున్నాడు సూర్య. ఆ గుడిసె కూడా సగం తడిసిపోయి వుంది. ఒక మనిషి పడుకోగలిగినంత మాత్రమే తడవలేదు. మిగిలిన ఇల్లంతా దాదాపుగా తడిసిపోయి వుంది. దుప్పటి కూడా ఒకటే వుంది. ఆ తడవని స్థలంలో సూర్యని పడుకోమని ఆ దుప్పటి ఇచ్చారు. సూర్య దుప్పటి కప్పుకొని పడుకున్నాడు. ఆ వృద్ధ దంపతులు వానకి తడుస్తూ, చలికి వణుకుతూ రాత్రంతా జాగారం చేశారు పాపం.

సూర్యకు మెలకువ వచ్చింది లేచాడు. అప్పుడే సూర్యుడు ఉదయిస్తూ వున్నాడు. చుట్టూరా పచ్చని పంటపొలాలు, పక్షుల అరుపులు ఇవన్నీ చాలా అందంగా కనిపించాయి సూర్యకు. లేచి చూడగానే తన బట్టలు ఆరుబయట ఆరేసింది అవ్వ. పళ్ళు తోముకోమని వేప పుల్ల అందించాడు తాత. ముఖం కడుక్కోగానే రొట్టె చేశా గింత తిందువు రా నాయనా అంటూ ఆప్యాయంగా పిలిచింది అవ్వ. సూర్య వద్దు వద్దని అన్నా తినేదాకా వదలలేదు ఆ వృద్ధ దంపతులు. రొట్టె తినడం ముగిసిన తర్వాత ఆరిన బట్టలను వేసుకుని తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యాడు సూర్య. చివరగా నీపేరేమిటి తాతా అని అడిగాడు సూర్య. నా పేరు 'బాబయ్య' అని అంటారు నాయనా అన్నాడు. తాతా మీరు చూపిన ఆదరాభిమానాలకు జీవితాంతం ఋణపడి వుంటాను అన్నాడు సూర్య. అప్పుడు తాత ఒకే మాటన్నాడు 'ఈ జీవితంలో ఏదీ శాశ్వతం కాదు నాయనా. మనం చేసిన మంచి, చెడు ఈ రెండే మన వెంట వస్తాయి. కానీ ధనము, ధాన్యము ఇవి ఏమీ మన వెంట రావు' అని అన్నాడు తాత.

సూర్య మనసులో వెంటనే ఒక ఆలోచన వచ్చింది. అదేమిటంటే ఈ జగత్తును, చరాచర జీవరాశులను రక్షించువాడు ఆ షిరిడి సాయి బాబాయే కదా! నా యీ ముడుపు తిరిగి ఇలాంటి జీవులకే కదా అని అనుకున్నాడు. అనుకున్నదే తడువుగా తన బ్యాగులో వున్న ముడుపును ఆ వృద్ధ దంపతుల చేతిలో వుంచాడు. వారు ఇది ఏమిటి నాయనా అని అన్నారు. వారు దానిని తెరచి చూసే లోపే సూర్య అక్కడ నుండి కన్నీటితో ఆ వృద్ధ దంపతులను చూస్తూ గబగబా నడిచాడు. అటుగా వెళ్తున్న బస్సును ఆపి ఎక్కి కూర్చున్నాడు. బస్సు బయలుదేరింది. బాబూ! బాబూ! అనే శబ్దం సూర్య చెవిని తాకింది. కిటికీలో నుండి అటుగా చూశాడు. పొలాల వెంబడి ఆ వృద్ధుడు పరుగెడుతూ నాయనా ఇదిగో నీ డబ్బు అంటూ బస్సు వైపు పరుగు తీస్తూ వస్తున్నాడు. అలా వస్తున్న ఆ తాత ఆ క్షణంలో సూర్యకు సాక్షాత్తు ఆ షిరిడి సాయిబాబాయే వస్తున్నట్లునిపించింది. రెండు చేతులు ఎత్తి నమస్కరించాడు. తన రెండు కళ్ళ నుండి కన్నీరు కారసాగింది. బస్సు వేగంగా ప్రయాణిస్తూ వుంది షిరిడి వైపు కాదు కదిరి వైపు. ←